క్లుప్తంగా

గ్రీన్ అంబాసిడర్లకు సామగ్రి పంపిణీ



గ్రీన్ అంబాసిడర్లకు సామగ్రిని అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ నాగరాజు

పాములపాడు: స్థానిక గ్రామ పంచాయతీలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు సచివాలయ మండల కన్వీనర్ నాగరాజు దాదాపు రూ. 15 వేలు విలువ చేసే సామగ్రిని కొనుగోలు చేసి ఆదివారం పంపిణీ చేశారు. వారికి యూనిఫాం, చీపుర్లు, పారలు, ప్లాస్టిక్ బాలేలు, బూట్లు, చేతికి రబ్బర్ బ్లౌజ్‌లు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోపాల్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడు సూచించిన విధంగా సన్మార్గంలో నడుచుకొంటూ దానధర్మాలు, సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమారాచారి, సంజీవ, పుల్లారెడ్డి, చక్రపాణి, శ్రీనివాసులు, నాగమద్ది పాల్గొన్నారు.

శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్

శ్రీశైలం: వరుస సెలవులు ఉండటంతో వందల సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలి రావడంతో శ్రీశైలంలో ఆదివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. శ్రీశైలం డ్యాం నుంచి ప్రారంభమై ట్రాఫిక్‌ను నియంత్రించడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. అంతర్గత రహదారుల వద్ద గేట్లు మూసివేయడంతో వాహనాలను భక్తులు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక అయోమయానికి గురయ్యారు. పోలీసులు చర్యలు ట్రాఫిక్‌ని నియంత్రించడానికి నానా అవస్థలు పడ్డారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

మహానంది: గాజులపల్లెలోని వైన్ షాపు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఆదివారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. గాజులపల్లెకు చెందిన బాషాతో పాటు మరొకరు, మహదేవపురం గ్రామానికి చెందిన బైక్‌లపై వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

నల్లమలలో దొంగల కోసం గాలింపు

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో మహానందీశ్వరుడి భక్తుల వాహనాల నుంచి బ్యాగులను చోరీ చేసిన దారి దోపిడీ దొంగల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు ఆదివారం రాత్రి వరకు నల్లమల అడవిలోని పాలేరువాగు, తెలుగుగంగ వంతెన తదితర ప్రాంతాల్లో అణువణువునా అన్వేషించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, బెదిరింపులకు పాల్పడినా సమీప గ్రామాల ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

నూతన సారథులకు సత్కారం



ఆత్మకూరు మండల, పట్టణ అధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా నియామకమైన సయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డిలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి మరోసారి ఈ పదవులకు కేంద్ర పార్టీకి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివశంకరరెడ్డి, ఫ్వ్వాడి భాస్కర్, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి, కౌన్సిలర్లు సుల్తాన్, రహిమాన్, విజయ్ పాల్గొన్నారు.

మహానంది: అందరి సహకారంతో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మహానందిలో మండల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నాపై ఉంచిన నమ్మకాన్ని ఏ మాత్రం వమ్ము చేయనన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అవుతు జయసింహారెడ్డి, నాగార్జునరెడ్డి, డిష్ బాలుడు, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మా మహేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం







తుమ్మలూరులో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వర్‌రెడ్డి, నల్లమలై జంగిల్ క్యాంపులో శ్రమదానం చేస్తున్న ఎంవీఎస్ నాగిరెడ్డి, మిడుతూరులో చెత్తను శుభ్రం చేస్తున్న దృశ్యం



వెలుగోడులో స్వచ్ఛ భారత్ కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్, అధికారులు

మన గ్రామాన్ని మనమే బాగు చేసుకుందాం

- గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు
- శ్రమదానం చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



బానకచర్ల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో దాసు



ముష్టపల్లె గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



పారుమంచాల చెరువు వద్ద శ్రమదానం చేస్తున్న సర్పంచ్ మాధవరం ప్రకాశం, గ్రామస్తులు



పగిడ్యాల బస్టాండులో చెత్త ఊడ్చుతున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, అధికారులు

పాములపాడు: మన గ్రామాన్ని మనమే బాధ్యతగా బాగు చేసు కుందామని ఆర్డీఓ దాసు అన్నారు. ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బానకచర్ల గ్రామంలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి శ్రమదానం చేయడంవల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చునని, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే తుమ్మలూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డి, సర్పంచ్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలోఎస్‌ఓ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినిలు అందరూ పాఠశాల ఆవరణంలో శ్రమదానం చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా..

కొత్తపల్లి: మండలంలోని గ్రామాలలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వచ్ఛభారత్ కార్మికులు నిర్వహించారు. కొత్తపల్లిలో సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. చీపుర్లు చేతపట్టి రోడ్లను శుభ్రం చేస్తూ శ్రమదానం చేశారు. దుద్యాల గ్రామంలో సచివాలయ సిబ్బంది, నాయకులు ప్రాథమిక పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. నందికుంట గ్రామంలో సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చారు.. కార్యక్రమంలో సర్పంచులు నిత్యలక్ష్మీదేవి, లక్ష్మీదేవి, ఎంపీటీసీ బాలరాజు, జగనన్న ఇళ్లస్థలాల మండల కో–ఆర్డీనేటర్ పరశురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, చింతమాను శ్రీనివాసులు యాదవ్, లింగారెడ్డి ు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నందికొట్కూరు రూరల్ : గ్రామంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొణిదేల గ్రామ సర్పంచ్ నవీన్ అన్నారు. ఆదివారం గ్రామంలో వలంటీర్లు, పంచాయతీ అధికారులతో కలిసి ఆయన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారులపై చెత్త చెదారాన్ని, వ్యర్థ పదార్థాలను వేయకుండా ప్రజలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం ..

మిడుతూరు: చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తువ్వా లోకేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో చీపుర్లు పట్టి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, కేజీబీవీ ఎస్‌ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ బైర్లూటి రేంజ్ సిబ్బంది ఆదివారం ముష్టపల్లె గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్‌ఆర్‌వో రామకోటి ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ సిబ్బందితో కలసి అటవీ సిబ్బంది కలసి గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అలాగే వీధుల్లో పార్థీనియం మొక్కలను తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రపరిచారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,కార్యదర్శి, అటవీ సిబ్బంది పెద్దయ్య, మంజులాదేవి, మధు బాబు, లక్ష్మీదేవి, ఇస్మాయిల్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

వెలుగోడు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చు అని సర్పంచ్ వేల్పుల జయపాల్ అన్నారు. ఆదివారం సర్పంచ్ వేల్పుల జైపాల్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ తాహీ సేవ 'కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని గ్రామపంచాయతీ ఆఫీస్ నుంచి హైస్కూల్ వరకు రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం తొలగించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఈఓ హరిలీల, జూనియర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

నల్లకాల్వలో..

ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామం లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శాంతమ్మ,పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నల్లమలై జంగిల్ క్యాంప్‌లో స్వచ్ఛభారత్

ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటి నల్లమలై జంగిల్ క్యాంప్ రిసార్ట్స్‌లో ఆదివారం జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. నాగలూటి రేంజర్ దొరస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఇళ్లు, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జూపాడుబంగ్లా: ఇంటిని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ యశోద, సర్పంచ్ మాధవరం ప్రకాశం తెలిపారు. ఆదివారం జూపాడుబంగ్లాలో పరిసరాల శుభ్రతపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. సర్పంచ్ మాధవరం ప్రకాశం చెరువు వద్ద శ్రమదానం చేశారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డి.బాలు, అధ్యాపకులు డాక్టర్.కె.రాజన్న, డాక్టర్.ఎం.బుచ్చయ్య, కె.నిర్మల పాల్గొన్నారు.

శ్రమదానానికి విశేష స్పందన

పగిడ్యాల: జాతిపిత మహాత్మ గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ కార్యక్రమానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య హాజరయ్యారు. అలాగే మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం. ఘణపురం తదితర గ్రామాల్లో చేపట్టిన శ్రమదానంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీలలోని చెత్తచెదారాన్ని తొలగించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా స్వచ్ఛతా కార్యక్రమాలు

మహానంది: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో ఆదివారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేశారు. రెండు మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గంట పాటు పరిసరాల పరిశుభ్రతా పనులు చేపట్టినట్లు ఎంపీడీఓలు శివనాగజ్యోతి, వాసుదేవగుప్త తెలిపారు.

యాదవ సత్రంలో స్వచ్ఛతా హీ సేవ

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలోని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక యాదవ సత్రంలోని పరిసరాలను ఆదివారం మేనేజర్ ఆర్‌వీఎస్ శివయ్య ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో సత్రం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం మన బాధ్యత



పాములపాడులో సీనియర్ సిటిజన్లతో ఆర్డీఓ దాసు

కొత్తపల్లి: పెద్దలను గౌరవించడం మన బాధ్యత అని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అన్నారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి గ్రామసచివాలయంలో వృద్ధులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పెద్దలను మన మందరం గౌరవించాలన్నారు. వారు చూపిన మార్గంలో నడుస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మండలంలో 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులను దుశ్శాలువలు, పూలమాలలతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు లింగేశ్వర్, బాబుమియా, కంప్యూటర్ ఆపరేటర్ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

పాములపాడు: ప్రజలకు ఓటు వజ్రాయుధం లాంటిదని ఆర్డీఓ దాసు అన్నారు. ఆదివారం మండలంలోని బానకచర్ల గ్రామంలో 80 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మనల్ని పాలించే ప్రజా ప్రతినిధులను ఓటు ద్వారా ఎన్నుకునే హక్కు మనకు ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో జీవించండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మారుతిశంకర్

జూపాడుబంగ్లా: పలుకేసుల్లో నిందితులుగా ఉండి రౌడీషీటర్లుగా గుర్తింపు పొందిన వారు సత్ప్రవర్తనతో జీవించాలని ఎస్‌ఐ మారుతిశంకర్ సూచించారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గతంలో చేసిన పొరపాట్లు, తప్పిదాలను విస్మరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా పద్ధతిగా, ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అలాకాకుండా యథావిధిగా నేరాలకు పాల్పడితే పీడీయాక్టు ప్రయోగించి గ్రామ, జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్త కలిగి వయోభారం, అనారోగ్యంతో బాధపడ్తున్న వారి పేర్లు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి వారికి ఊరటకలిగేలా చేస్తామని హామీ ఇచ్చారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: రజకులు విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని రజక సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్, గౌరవ అధ్యక్షుడు బస్తిపాటి మౌలాలి అన్నారు. ఆదివారం పారుమంచాల గ్రామంలో రజకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నానాటికి అణగారిన కులంగా మారుతున్న రజకులు, వారి హక్కులను సాధించుకునేందుకు సంఘటితం కావాలన్నారు. చాకలి, చాకలోడా అనే పదాలను నిషేధిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసిన నేపథ్యంలో ఎవ్వరైనా అలా సంబోధిస్తే వెంటనే పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేయించాలన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీ అధ్యక్షునిగా నడిపి వెంకటస్వామి, ఉపాధ్యక్షునిగా చిన్నరంగస్వామి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా శేఖర్, ప్రచార కార్యదర్శిగా పెద్దరంగస్వామి, కోశాధికారిగా చిన్నవెంకటరమణ, గౌరవ అధ్యక్షుడిగా పెద్దవెంకటరమణను ఎన్నుకున్నారు.

మహానంది భక్తజనసంద్రం



మహానందీశ్వరస్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

మహానంది: వరుస సెలవులు కలిసిరావడంతో మహానంది ఆలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం సుప్రభాతసేవ, అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి ఏకాంతసేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆర్జితసేవాటికెట్లు, అభిషేకాలు, ప్రసాదాల విక్రయం, ఇతర విభాగాల ద్వారా సుమారు రూ. పది లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన వసతిగృహాలు తక్కువగా ఉండటం, అన్నీ నిండిపోవడంతో భక్తులు ప్రైవేటు లాడ్జీల వైపు వెళ్లాల్సి వచ్చింది. దీంతో సందట్లో సడేమియా అన్న చందంగా పలువురు లాడ్జీల నిర్వాహకులు ఇదే అదనుగా సాధారణ రోజుల్లో రూ. 500 మాత్రమే ఉండే గదులను రూ. 2000 వరకు, ఏసీ గది సాధారణ రోజుల్లో రూ. 1000 నుంచి రూ.1200 తీసుకునే రూములను రూ. 3 నుంచి రూ.4వేల వరకు వసూలు చేసుకున్నట్లు పలు ప్రాంతాల భక్తులు వాపోయారు. అధికారులు, పోలీసులు స్పందించి నిర్ణీత ధరలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్వార్టర్ ఫైనల్‌కు ఎనిమిది జట్లు

మహానంది: మహానందిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలమద్దిలేటి వెల్లడించారు. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

నందికొట్కూరు: గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మాంసం అంగళ్లు బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ నోటీసులు జారీ చేశారు. ఆదివారం పట్టణంలోని మాంసం అంగళ్లకు 2వ తేదీ మూసివేయాలని మున్సిపల్ సిబ్బంది నోటీలు ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే తీవ్ర పరిణాలు తప్పవని హెచ్చరించారు.

మనువాద పార్టీలను ఓడిద్దాం

నందికొట్కూరు: బహుజనులను మోసగిస్తున్న మనువాద పార్టీలను ఓడించాలని బహుజన సమాజ్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా ఇన్‌చార్జ్ లాజర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కాన్షీరాం విగ్రహం నుంచి మల్యాల, అల్లూరు, వడ్డేమాన్, బ్రాహ్మణ కొట్కూరు, 10 బొల్లవరం గ్రామం మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మనువాద పార్టీలుగా బీజేపీ, కాంగ్రెస్, టీడీపీల్లో కనీసం 10 శాతం లేని కులాలు 75 ఏళ్ల నుంచి బహుజనుల ఓట్లతో అందలం ఎక్కి అవకాశాలను, వనరులను అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు లింగస్వామి, ఆయా మండలాల అధ్యక్షులు రాజు, విజయకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దోచుకుంటే చట్టం ఊరుకోదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి

జూపాడుబంగ్లా: ప్రజాధనాన్ని దోచుకొంటే చట్టం చూస్తూ ఊరుకోదని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి అన్నారు. ఆదివారం ఆయన జూపాడుబంగ్లా పాతసినిమా హాలు వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్‌స్కాం కేసులో సీఐడీ వారికి సాక్ష్యాధారాలతో దొరికిపోయినా తాను తప్పుచేయలేదని చంద్రబాబు బుకాయించడం ఆయన అవినీతికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ సొమ్ముకు కాపలాదారుగా ఉండాల్సిన చంద్రబాబు రూ.370కోట్ల ప్రజాధనాన్ని భక్షించి బుకాయించటం సరికాదన్నారు. కార్యక్రమంలో పాములపాడు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి, బన్నూరు సొసైటీ చైర్మన్ వై.వెంకటరమణ, సర్పంచులు పీఎం నాగిరెడ్డి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ నీలం సంజీవరెడ్డి డిగ్రీ కాలేజీ 2005–2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. కళాశాల అభివద్ధికి కృషి చేద్దామంటూ, తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి, మోమెంటోలు అందజేశారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన బోగోలు సుదర్శన్ తదితరులను తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ అల్లె శంకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ హైమావతి, అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, శ్యాంప్రసాద్, విద్యా సాగర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో రెండో స్థానం

- జూపాడుబంగ్లాలో 79.15 శాతం పంపిణీ
- 5,133 పింఛన్లకు గాను 4,063 పూర్తి

జూపాడుబంగ్లా: అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ ఆదివారం తెల్లవారుజామునే ప్రారంభం కాగా 79.15శాతం పంపిణీతో జూపాడుబంగ్లా మండలం జిల్లాలో రెండో స్థానంలో నిలిచినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలానికి 5,133 పింఛన్లు మంజూరు కాగా సాయంత్రం 5గంటల్లోగా వలంటీర్లు 4,063 మందికి అందజేసి 79.15శాతం పూర్తి చేశారన్నారు. మిగిలిన పింఛన్లను సోమవారం సాయంత్రంలోగా పంపిణీ చేసి వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు.

నియోజకవర్గం వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేసిన వివరాలు ఇలా...

మండలం	మంజూరైన పింఛన్లు	పంపిణీ చేసిన పింఛన్లు	పంపిణీ శాతం
జూపాడుబంగ్లా	5.133	4.063	79.15
నందికొట్కూరు అర్బన్	5.004	3.707	74.08
నందికొట్కూరు	5.277	3.871	73.36
మిడుతూరు	5.518	3.908	70.82
కొత్తపల్లి	4.346	3.058	70.36
పాములపాడు	5.956	4.085	68.59
పగిడ్యాల	4.980	3.293	66.32

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ

నందికొట్కూరు: పట్టణానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ వారం రోజుల క్రితం ఆయాసంతో బాధపడుతుండగా కర్నూలు గవర్నమెంట్ వైద్యశాలలో కుటుంబ సభ్యులు చేర్పించారు. విషయం తెలుసుకుని మూడో వార్డు వలంటీర్ సుభాషిణి కర్నూలు వెళ్లి పింఛన్ అందజేసింది. దీంతో వృద్ధురాలు జగనన్నకు కృతజ్ఞతలు తెలిపింది.

పొద్దున్నే పింఛన్ల పంపిణీ

మహానంది: సెలవు లేదు, అలుపు లేదు. సీఎం జగనన్న ఆశయమే వారి ముందుంది అన్నట్లు వలంటీర్లు గ్రామాల్లో పొద్దుపొద్దున్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు. మహానంది మండలంలో మొత్తం 5349 పింఛన్లు ఉండగా 4147 మందికి పంపిణీ చేసి 77.53 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు.బండిఆత్మకూ రు మండలంలో మొత్తం 6,710 పింఛన్లు ఉండగా 5098 మందికి పింఛన్లు పంపిణీ చేసి 76శాతం పూర్తి చేసినట్లు బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు.



కర్నూలులో చికిత్స పొందుతున్న మహేశ్వర రెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు ఆనంద్



గోపవరంలో నితిన్‌కుమార్‌కు వికలాంగ పింఛను ఇస్తున్న వలంటీర్ రమాదేవి